విద్యావ్యవస్థలో సమూల మార్పులు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- గురుకుల పాఠశాల అదనపు భవనానికి శంకుస్థాపన



నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం అరుంధతి కాలనీ వద్ద సుమారు రూ.3 కోట్లతో ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల (బాలుర) అదనపు వసతుల సదుపాయం కోసం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వారి అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడమే కాకుండా నాడు-నేడు పనుల కింద వేల కోట్ల నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేశారని, పేద పిల్లలు కూడా చదువుకునేందుకు చేయూతనిస్తూ అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టారని, పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేందుకు ట్యాబ్‌లను కూడా అందజేశారని గుర్తు చేశారు.

వినుకొండ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభివృద్ధి పథకాలను అడ్డుకునేందుకు పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టిస్తూ చిన్నచిన్న విషయాలకు కూడా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు, లోకేష్ రాజకీయ లబ్ధి కోసం గ్రామాల్లో గొడవలు సృష్టించాలనే పిలుపుమేరకే స్థానిక టీడీపీ నాయకులు కూడా అదే డైరెక్షన్‌లో నడుస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వినుకొండ నియోజకవర్గ అభివృద్ధిని ఆపలేరని అన్నారు.

కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ లత, గ్రామసర్పంచ్ శారా సరోజిని, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షకీలా దస్తగిరి, జడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిటి పోలేష్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ పద్మాబాయి నాయక్, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, కృష్ణానాయక్, ఏజీపీ ఎం.ఎస్.ప్రసాద్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో మంగా పురనాథ్, ఎంఈవో జప్రుల్లా, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇస్సప్పాలెంలో అమ్మవారి తిరునాళ్ల



మహంకాళి అమ్మవారు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి 48వ వార్షిక తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం రెండవ రోజుకు చేరాయి. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. అమ్మవారికి గవ్యాంతము, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తుబలి, ప్రధాన కలశారాధన, పంచామృత స్నపనము, జప పారాయణాలు, మహాలింగార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శైవాగామ పండితుడు యనమండ్ర సత్య సీతారామశర్మ ఆధ్వర్యంలో అర్చకస్వాములు కొత్తలంక రుద్రవీర కాళికా సత్య కార్తీకాయ, నండూరి కాళికృష్ణ పూజాధికారి జరిపారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు భక్తులు రాగి జావ, పులిహోర, మజ్జిగలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యతోనే మహిళాభ్యున్నతి

చిలకలూరిపేట: విద్యతోనే మహిళాభ్యున్నతి సాధ్యమౌతుందని స్త్రీ విద్యకోసం జీవితం అంకితం చేసిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని మహాత్మా జ్యోతిరావుపూలే చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పాల భాస్కరరావు చెప్పారు. సంఘ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్థంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గడియారస్తంబం సెంటర్‌లో ఉన్న జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, మారుబోయిన శ్రీనివాసరావు, వంకధారి పుల్లయ్య, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జాతీయ బీసీ సంక్షేమసంఘం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్థంతిని నిర్వహించారు. సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మాదాసు పృథ్వీరాజ్ సాయి, నాయకులు కొల్లి నాగేశ్వరరావు, కొండ్రముట్ల నాగేశ్వరరావు, రాజపూడి వెంకట్, మల్లా కోటేశ్వరరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

రైతుకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రైతుకు గిట్టుబాటు ధర కల్పించి అండగా ఉండటమే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం శనగలు ప్రభుత్వం నిర్ణయించిన రూ.5,335 రూపాయలకు కొనుగోలు చేస్తుందన్నారు. పల్నాడు జిల్లాలోని మొట్టమొదటి శనగలు కొనుగోలు కేంద్రాన్ని రొంపిచర్లలోనే ప్రారంభించామన్నారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో శనగలను రూ.4,300 నుంచి రూ. 4,400 లకే వ్యాపారులు కొంటున్నారన్నారు. మార్కెట్ యార్డులో శనగలను రైతులు అమ్మడం వల్ల క్వింటాళ్లకు రూ.1000 లకు పైగా రైతుకు మేలు జరుగుతుందన్నారు. అలాగే రబీలో పల్నాడు జిల్లాలో రైతులు 70 వేల ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. మచ్చ వచ్చిన శనగలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీపీ మురళి, జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గానుగపంట ఉత్తమరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, బత్తుల రామకృష్ణ, గుండాల వెంకటేష్, కల్లి పిచ్చిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు ఏడీఏ మస్తానమ్మ, ఏవో విజయభాస్కర్, వీఆర్వో సుబ్బారెడ్డి, మార్కెఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన ఆర్డీవో



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో శేషిరెడ్డి

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వం పేదవారి సొంతింటి కల నెరవేర్చేందుకు నివేశన స్థలాలు లేని వారికి అందరికీ ఇళ్ల పథకం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా యడ్లపాడు మండలం పరిధిలో ఇప్పటి వరకు 23 లేఔట్లను ఏర్పాటు చేసి జగనన్న కాలనీలను నిర్మిస్తున్నారు. అయితే వంకాయలపాడు, ఉప్పరపాలెం, బోయపాలెం, గ్రామాలకు కలిపి ఉప్పరపాలెం స్పైసెస్ పార్కు ఎదురుగా వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ భూమి వివాదంలో ఉండటం.. హైకోర్టుకు చేరటంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ భూములను ఇవ్వాలని సంకల్పించారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం ఉప్పరపాలెం గ్రామం పరిధిలోని సర్వేనెంబర్ 317 (2), 318 (ఏ) ప్రైవేటు భూములు మూడు ఎకరాలను, అలాగే వంకాయలపాడులోని సర్వే నెంబర్ 75 ,76లో మరో మూడు ఎకరాలను ప్రతిపాదించింది సదరు భూములను పల్నాడు జిల్లా నరసరావుపేట ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి మండల రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఏఎం రెడ్డి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: మండలంలోని పెట్లూరివారిపాలెం ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 82 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బోస్టన్ ఐటీ సొల్యూషన్స్ సంస్థ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలతో పాటు జేఎన్‌టీయూఎస్ ఇంజినీరింగ్‌కు కళాశాలకు చెందిన 408 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధి కిరణ్ ఆధ్వర్యంలో రాతపరీక్ష, సాంకేతిక పరీక్ష, హెచ్ఆర్ రౌండ్‌లను నిర్వహించి 82 మంది విద్యార్థులను ఎంపికచేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణా కాలంలో ఏడాదికి రూ.9 లక్షలు నుంచి రూ.10.5 లక్షలు వార్షిక వేతనంగా అందిస్తారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.జయకృష్ణ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నాదెండ్ల: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ చెప్పారు. నాదెండ్ల మండలంలోని సంకురాత్రిపాడు గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అంతరాయం కలుగుతుందన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో గల శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై. ఏడుకొండలు శుక్రవారం తెలిపారు.

చిలకలూరిపేటలో....

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శనివారం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ చెప్పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

అసమానతలపై ఆవేదన

చిలకలూరిపేట: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా మహిళల పట్ల వివక్ష, అసమానతలు, దాడులు కొనసాగుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షురాలు నాగభైరు రామసుబ్బాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు.

చేనేతలంటే లోకేష్‌కు గౌరవం లేదు

చేనేతలకు అండగా జగనన్న ప్రభుత్వం

చిలకలూరిపేట: చేనేతలంటే టీడీపీ నేత నారా లోకేష్‌కు ఎలాంటి గౌరవం లేదని ఆయన వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నాయకులు విమర్శించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ చేనేత విభాగం జోనల్ కోఆర్డినేటర్ అవ్వారు అన్నపశెట్టితో కలసి పద్మశాలి నాయకులు శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పేరుతో నారా లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్రలో వైఎస్సార్ సీపీకు చెందిన పద్మశాలి నేతలను ఉద్దేశించి ఏం పీకారు అని వ్యాఖ్యానించటం పట్ల అతనికి ఉన్న సంస్కారం ఏ పాటిదో తెలిసిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రతినిధి సింగరేసు పోలయ్య, నాయకులు బిట్రా శ్రీరాములు, మల్లేశ్వరరావు, గుంటు రామకోటేశ్వరరావు, గూళ్ల రాంబాబు, చెన్నకేశవులు, శ్రీనివాసరావు, కందుల శ్రీనివాసరావు, మధు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినాన్ని జయప్రదం చేయండి

నరసరావుపేట: నులి పురుగుల నివారణకు సహకరించి జయప్రదం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు, ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి జ్యోతికిరణ్ సూచించారు. ఈనెల 14న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కె.హనుమకుమార్ పలు సూచనలు చేశారు. అల్బెండ్‌జోల్ మాత్రలను డీఇవో జ్యోతికిరణ్, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు సమక్షంలో మున్సిపల్ స్కూళ్లు, ప్రైవేటు స్కూళ్ల ప్రతినిధులకు అందజేశారు. సీడీపీవో ఉమామహేశ్వరి, మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు టి.రవికాంత్, ఆక్స్‌ఫర్డ్ స్కూలు ప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్నులు చెల్లించవచ్చు


నరసరావుపేట: పురపాలక పరిధిలోని గృహ యజమానులు చెల్లించాల్సిన ఆస్తిపన్ను, కుళాయి పన్నులను కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్ ద్వారా సెలవు దినాలైన రెండో శనివారం, ఆదివారాల్లో చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం వెల్లడించారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

నరసరావుపేట ఈస్ట్: వసతి గృహాలలోని విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి రెడ్డినగర్‌లోని గురుకుల ఎస్‌టీ పాఠశాల హాస్టల్, ఎస్‌టీ కళాశాల బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందివ్వాలని తెలిపారు.

ప్రాణం తీసిన ఫుట్‌బోర్డ్ ప్రయాణం!

- ఇంటర్ విద్యార్థి దుర్మరణం
- గణపవరంలో విషాదఛాయలు



మృతుడు పార్థమ హేంద్రచౌదరి (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం పాలైన సంఘటన పల్నాడు జిల్లా గణపవరంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వజ్జా బ్రహ్మయ్య, సువర్చల కుమారుడు పార్థమహేంద్ర చౌదరి (18) చినకొండ్రుపాడులోని నైదా అకాడమీలో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఈ నెల 16న ఇంటర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో కొంత సామగ్రి తీసుకునేందుకు గురువారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం తిరిగి కళాశాలకు వెళ్లేందుకు తన తండ్రి బైక్‌పై జాతీయ రహదారి వద్దకు చేరుకుని చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అయితే ఫుట్‌పాత్‌పై ఉన్న కొందరు విద్యార్థులు డ్రైవర్ గేరు మార్చే సమయంలో బస్సు కుదుపుకు గురవటంతో అదుపుతప్పి పార్థమహేంద్రచౌదరి క్రిందపడ్డాడు. దీంతో తలపై బస్సు వెనుక చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎ.భాస్కర్, ఆర్టీసీ డీఎం రాంబాబు, సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

యడ్లపాడులో పర్యటించిన డెప్యూటీ కలెక్టర్

యడ్లపాడు: డెప్యూటీ కలెక్టర్ వసంత బాబు శుక్రవారం యడ్లపాడు మండల తహశీల్దారు కార్యాలయం సందర్శించారు. తుర్లపాడు, మైదువోలు రెవెన్యూ గ్రామాల పరిధిలోని రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. భూముల యజమానులందరికీ నోటీసులు జారీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు ఆయా గ్రామాలకు సంబంధించిన ఈ-సర్వే రికార్డులను పరిశీలించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమాన్ని పారదర్శకంగా తప్పులు లేకుండా వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎన్.నాగమల్లేశ్వరరావు డీటీ శ్యామలత, ఆర్ ఐ మోజేషు, సర్వేయర్ రాంబాబు, వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

అప్రెంటీస్ మేళా నిర్వహణ

చిలకలూరిపేటటౌన్: ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ ప్రాంగణంలో శుక్రవారం అప్రెంటీస్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన వీఎల్ఆర్ ఫెసిలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలలో 50 మంది ఎంపికయ్యారు. ఈ ఇంటర్వ్యూలలో కంపెనీ హెచ్ఆర్ ఎం.ధర్మా, ఏఎంజీ సీఏవో మాసిలామణి, ప్రిన్సిపల్ మణిదీపక్ పర్యవేక్షించారు.

రేపు వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం శివారు మర్రిచెట్టుపాలెం శ్రీ వీరాంజనేయ స్వామి 42వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ జానకిరామాచార్యులు తెలిపారు. ప్రతి ఏటా పాల్గుణ బహుళ పంచమీ నాడు ఆలయ వార్షికోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. మండలంలో ఈ తిరునాళ్లకు అత్యంత ప్రాముఖ్యత ఉంది.

దాడి చేశాడంటూ కేసు నమోదు

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన కేసు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యడ్లపాడుకు చెందిన డేరంగుల నరసమ్మ స్థానిక ఉన్నత పాఠశాల రోడ్డులో నివాసం ఉంటుంది. ఈమె నివాసం ఉంటున్న ఇంటి వివాదం కొంతకాలం ఉంది. ఒకరినొకరు తమ దేనంటూ వివాదం కాస్తా న్యాయస్థానానికి చేరింది. ఈ నేపథ్యంలో వీరాంజనేయులు గురువారం నరసమ్మ ఇంటికి వచ్చి ఖాళీ చేయాలంటూ దౌర్జన్యంగా ఆమెపై దాడి చేశాడు. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14న నులిపురుగుల నివారణ దినోత్సవం

శావల్యాపురం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని వచ్చే మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారిణి యం.శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు బాక్సులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది 01నుంచి 19 సంవత్సరాల లోపు చిన్నారులకు మందు బిళ్ళలు మధ్యాహ్న భోజన అనంతరం మింగించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, మండల వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం ,ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భోజన పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పారదర్శకంగా ఉండాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం వంటకాల రుచులు స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రతి పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన నిర్వహణ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సారథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు కోడిగుడ్డు, చిక్కీలు ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెంచులక్ష్మి ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రొంపిచర్ల: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. రోడ్డుపై ముందు భాగంలో వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు అధిగమించే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనం రెండూ రోడ్డుపై నుంచి పల్టీకొట్టాయి. ఈ ప్రమాదంలో పొందూరి పెదవీరయ్యకు ఎడమ కాలు విరగ్గా, దండా నాగేశ్వరరావు, ఇ.రమేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వారిని కారు నుంచి బయటకు తీసి నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. రొంపిచర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభల ఏర్పాటుకు అనుమతి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వెంకటనారాయణస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని విద్యుత్ ప్రభలకు అనుమతికి దరఖాస్తు చేసుకోవచ్చని బండ్లమోటు ఎస్ఐ జె.బలరాంరెడ్డి శుక్రవారం తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రభలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరునాళ్ల సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

నాదెండ్ల: జాతీయ రహదారి పక్కనే గణపవరం గ్రామ పరిధిలోని పెట్రోల్ బంకును తహసీల్దార్ ఏవీ రమణ శుక్రవారం తనిఖీ చేశారు. పెట్రోల్ బంకు నిర్వహణ పత్రాలు, పెట్రోల్ నాణ్యత, కొలతలు తదితరాలు పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ రమీజా, సిబ్బంది ఉన్నారు.

పశువిజ్ఞాన బడి కార్యక్రమం

ఈపూరు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఈపూరు సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పశుగ్రాసాల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ముప్పాళ్ల పశువైద్యాధికారి, పాడిరైతులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముట్లూరి మణిరత్నంపై అదే గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు ఇరువురు వ్యక్తులు కులం పేరుతో దూషించి కొట్టిన సంఘటనపై ఇరువురుపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపారు. ఈనెల 9వ తేదీన సాయంత్రం రీసర్వే పనులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేయగా, ఈ పని నేను చేసేది కాదని ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు పక్కనే పెట్టగా గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు కులం పేరుతో దూషించి దూర్భాషలాడి, గొడవపడి కొట్టినట్లు మణిరత్నం ఫిర్యాదు చేశారన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంక పరచటంతో పాటు కులం పేరుతో దూషించి కొట్టినందుకు గాను ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపారు.


అధికారుల పాత్ర కీలకం

శావల్యాపురం: ప్రభుత్వ పథకాల అమలు తీరులో గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలకపాత్ర పోషించాలని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తలూరు గ్రామసచివాలయాన్ని మండల స్థాయి అధికారులు సందర్శించారు. ఆయనతో పాటు సెక్టారు సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఏపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ ఎస్ఐ సురేంద్ర బాబు శుక్రవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు నకరికల్లు మండల త్రిపురాపురం గ్రామంలో గండిబోయిన సీతారామయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్నా సమాచారం మేరకు అతని గృహంలో దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

• 'పెద్ద'మనసు!



స్థానిక బాబాపేటలో సయ్యద్ ఇస్మాయిల్ అనే వృద్ధుడు సుమారు రూ.60 లక్షలు విలువచేసే నాలుగు సెంట్ల స్థలాన్ని మజీద్, మదర్సాల కోసం వితరణ చేశారు. శుక్రవారం జామియా మజీద్ మౌలానా సాహిది రజాపఠాన్, నాసర్‌వలి, షేక్ రసూల్, షేక్ దరియావలి, మత పెద్దలు కలిసి దాత సయ్యద్ ఇస్మాయిల్‌కి చిరు సన్మానం చేశారు. విలువైన భూమిని ఆ అల్లాహ్ మార్గంలో దానం చేయటం గొప్ప విషయమని, ఆ స్థలంలో మజీద్‌తో పాటు మదర్సా నిర్మాణం చేపడతామని మత పెద్దలు చెప్పారు. ఎంఐఎం నాయకుడు మస్తాన్‌వలి పాల్గొన్నారు. –నరసరావుపేట